'సూర్యదేవత సాక్షిగా నిన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పి నాచేత పిరమిడ్లలోని ధనసంపద అంతా నీ ధనాగారానికి చేర్పించుకుని నన్ను చంపించ పోతున్నావా? నైలు నాగినీ! క్లియోపాత్రా!' అరిచాడు హేర్ మాఖిన్ అనే ఈజిప్టు రాజవంశీకుడు.

క్లియోపాత్ర నీలాలూ, కెంపులూ వెదజల్లినట్లు నవ్వింది. ఆమె సుందరమైన వేళ్ళు పిల్లిని దువ్వుతున్నాయి. ఈజిప్టు రాజభవనంలో అదొక రహస్య గది. ఆమె నవ్వు చూసి హేర్ మాఖిన్ మండిపోయాడు.

"నీవు అపురూప సౌందర్యవతి వని నమ్మాను. కాని, వేశ్య కంటే కనాకష్టంగా ప్రవర్తించావు. నీవు మహారాణివి కావు; కామపిశాచివి. నీ భర్తలిద్దర్నీ చంపించావు. అందుకు సహాయంగా ముసలివాడై, మూర్ఛ రోగియైన సీజర్ని వలలో వేసి, మతాధికారుల చేత సీజరు సూర్యదేవుడి అంశలో వచ్చి నీకు కొడుకుని ప్రసాదించాడని ప్రజల్ని నమ్మించావు. నీవు సూర్యుడి రాణిగా నిలబడ్డావు. నీకు పుట్టిన సంకరుడు దేవుని బిడ్డ. కాని, రోమన్లు వెర్రివాళ్ళు కారు. సీజర్ని హత్య చేశారు."

"నేను దానికి విచారించటం లేదు. నా కన్న చిన్నవాళ్ళయిన సోదరుల భార్యగా ఉండటానికి అసహ్యించుకున్నాను. ప్రపంచంలో ఎక్కడా లేని ఈ కథ నాకు వెగటు పుట్టించింది. సీజరు ముసలి వాడయినా జగజ్జేత. నిజమే. తిరాసీలో దాక్కొని అతని ఆశ్రయం కోరాను" అంది ఆ నాటి విషయం జ్ఞాపకం చేసుకుంటూ.

"ఆంటోనీని అభిమానిస్తూ, నాతో ప్రేమ కలాపాలు సాగించావు—అది న్యాయమా?"

"రాజకీయాల్లో న్యాయాన్యాయ ప్రసక్తి లేదు. ఆంటోనీ సీజరు మిత్రుడై కూడా ఈజిప్టు మీదికి ఎత్తి వచ్చాడు. అత్యంత ధనిక దేశమైన ఈజిప్టు మీద అతని దృష్టి పడింది. నా ప్రజల్నీ, పిల్లల్నీ రక్షించుకోవా లనుకున్నాను. అతన్నికూడా జయించాలంటే నాకు తెలిసిన మార్గం ఒకటే. నా సౌందర్యం. ఈజిప్టు మహారాణి క్లియోపాత్రా తనని ప్రేమిస్తున్నదని అతననుకునేట్లు చేశాను. నిజంగా ప్రేమించాను, మాఖిన్."

"ఆంటోనీని నీ మాయలో పడేశావు. తిండి, తాగుడు, బానిసలు, నీ శృంగార విహారాలతో ఆంటోనీ లోకం మరిచి రక్తపాతంలో, జన క్షయంతో సంపాదించిన రోమ్ భూభాగాలు నీకు ధారపోశాడు. నీ మూలంగా రోమ్‌లో తిరిగి అంతర్ యుద్ధాలూ, అలజడీ ప్రారంభమయినాయి. నీవు మళ్ళీ సంకర సంతానాన్ని కన్నావు. అతనికి ఆత్మహత్య కన్నా ప్రస్తుతం గత్యంతరం లేదు. కాని, నీ సంగతి ఏమవుతుం దనేది అతని బాధ" అన్నాడు హేర్ మాఖిన్.

"ఈ మగ పురుగులు ఏం ఆలోచిస్తారో నీకు బాగా తెలుసు. ఆంటోనీతో బాటు నేనూను."

"నీ కల్ల బొల్లి కబుర్లూ, కన్నీళ్ళూ అతన్ని కరిగించవచ్చును కాని, నన్ను కరిగించలేవు. అతను లేని లోకం శూన్యమనీ, ప్రాణాలు విడుస్తాననీ చెప్పి అతన్ని యుద్ధానికి పంపావుగా. ఇప్పుడు నీకు హత్యలు చేయటంలో చేయి తిరిగింది. ఆంటోనీకీ, నీకూ అడ్డు వచ్చిన సెరాపియన్ సేనానిని చంపించ లేదా? అనంతరం ఆంటోనీతో వాడు ద్రోహి కనక రాణిగా నీ శ్రేయస్సు కోరి చంపించానని చెప్ప లేదా?"


"లేదని ఎందు కంటాను? నేను పది భాషలు నేర్చుకున్న విషయం, నా మేధ విషయం చెప్పవేం, మాఖిన్" అంది క్లియోపాత్రా.

"పిరమిడ్లలో చక్రవర్తుల ఆత్మలు తిరుగుతా యని అంటే విన్నావా? ఎన్నో లక్షల, కోట్ల విలువ చేసే సంపద నీకు అవసరం కాని సత్యం కాదు. ప్రేమ అంతకంటే కాదు. ఆ ధనం నీవు తెచ్చుకోవటానికి భయం వేసి నాతో ప్రేమ నటించి, నన్ను పంపావు. ఆ మమ్మీలతో నేను పడిన పాట్లు, ఆ భయంకరమైన అనుభూతులు ఈజిప్టు రక్తం ప్రవహిస్తున్న ఎవరైనా నమ్ముతారు—సంకరజాతి పిల్లల్ని కన్న నీవు తప్ప."

"నేనూ నమ్ముతాను, మాఖిన్. నేను సంకరజాతి పిల్లల్ని కన్నాను. కాని, సంకర జాతి రక్తం నాలో లేదు. అందుకే ఆ మమ్మీల శాపాలు పడలేక నిన్ను పంపించాను. టోలమీ సమాధిలో ఏం జరిగింది?"

"ఆంటోనీ చావు తథ్యం. అనంతరం ఆక్టేవియస్ రోమ్ చక్రవర్తి అవుతాడు. అతను ఆంటోనీ నీకు ధారాదత్తం చేసిన భూముల్నే కాదు, ఈజిప్టునే నాశనం చేయటానికి ప్రయత్నిస్తాడు. నీ వగలు అతని ముందు కొరగావు. ముసిలాడు సీజరూ—బుద్ధిహీనుడైన ఆంటోనీ—తెలివి తక్కువ వాడైన హేర్ మాఖిన్నూ కాడు ఆక్టేవియస్. రోమన్ సైన్యాలతో అతను ఈజిప్టుకి వస్తాడు. నిరిగి ఆత్మలు అతనికే సహాయం చేస్తాయి. రోమ్ వీధుల్లో సంకెళ్ళలో నడుస్తావో, ఆత్మహత్య చేసుకుంటావో నిన్నే తేల్చుకో మన్నాయి మమ్మీలు."

"నమ్ముతాను. మమ్మీల్ని నిరసించాను హేర్ మాఖిన్. ఆత్మహత్యే చేసుకుంటాను అలాంటి పరిస్థితి వస్తే. ఏనొప్పీ,బాధాలేకుండా చచ్చే మార్గం చూపించమని ఆస్థాన వైద్యుడు ఒలింపస్‌ని అడిగాను. నైలు నదిలోని చిన్ని పాము కాటు వేస్తే బాధ తెలియదని అతను చెప్పాడు. డార్లింగ్! ఇంకో గంట కన్నా నీకు ఆయుర్దాయం లేదు. నా కెంత కాలం ఉందో నాకు తెలియదు. నేను చేసినవి పాపాలో! పుణ్యాలో! శాపాలు మాత్రం అయినాయి. నేను రాణిగా జన్మించాను. రాణిగా జీవించాను. రాణిగానే చనిపోతాను" అంది ధీమాగా క్లియోపాత్రా.




## చరిత్ర కందని చిత్ర కథ

- డాక్టర్ లత

అన్నది క్లియోపాత్రా.

భయంతో హేర్ మాఖిన్ కళ్ళు పెద్దవయినాయి. వణికి పోసాగాడు. టోలమీల ఆత్మలు అక్కడే తిరుగుతున్నట్లు అనుభూతి చెందాడు. అతనిలో చావు కళ పడింది.

"చెప్పు—హేర్ మాఖిన్, ఏం జరిగింది?"

"నీ ఆర్థిక స్తోమత పెంచి, నీ ఆయుర్దాయాన్ని తగ్గిస్తా నన్నాయి ఆత్మలు."

"బాగుంది — ఫరవాలేదు. వార్ధక్యంలో శరీర బాధతో చచ్చే కన్న యౌవనం పోకుండా చావటమే మంచిది. నీవు ధైర్యవంతుడివి. పిరమిడ్లలోని సంపద తెచ్చావు. ఆ విషంగా నన్ను ఆనందపరిచినందుకు బాధ లేని మరణం దొరుకుతుంది—విచారించకు" అంది నవ్వుతూ క్లియోపాత్రా.

"ఆ శాపం నాకు మమ్మీలే ప్రసాదించాయి. దానికి నాకూ భయం లేదు. కాని, నీ విషయం అంత తేలిగ్గా వదలవు, ఆత్మలు."

"ఏం చేస్తాయి?" పాలిపోయిన మొహంతో అడిగింది ఆమె.

విషం అప్పటికే పని చేయటం ప్రారంభించిన హేర్ మాఖిన్ గొణుగుతూ—"అవును. పిరమిడ్ల జోలికి పోయినందుకు నేనూ, పొమ్మని చెప్పినందుకు నువ్వూ అకాల మరణం పొందుతున్నాం. ఈజిప్టు పాలకులు చేయరాని పని మనిద్దరం చేసి మమ్మీల్ని నిద్ర లేపాం. ఆ పాపం వలన నీ సమాధీ, నా సమాధీ కొన్ని వందల సంవత్సరాలు ఎవరికీ దొరకవు. ఆత్మలు దొరకనీయవు. నీ పిల్లలు ఈజిప్టు రాజసింహాసనం ఎక్కలేరు. నీవూ, నేనూ రాణి, రాజుగా నరకాన్ని పాలిస్తాం. నీ మాటలు నమ్మినందుకు నా కిదే శిక్ష. నీ ముక్కు కాస్త వంకరయితే ఈజిప్టు చరిత్ర మరో మాదిరిగా ఉండేది. ఆనాటి నీ కౌగిలి కన్న ఈ బాధారహిత మరణం నాకు చాలా ఆత్మీయమైనది" అని ప్రాణం విడిచాడు. క్లియోపాత్రా పిల్లితో సహా వెళ్ళిపోయింది. ( ఈ మధ్యనే ఈజిప్టు రాజవంశీకుల సమాధుల్లో హేర్ మాఖిన్ సమాధి కనిపించింది ) .